

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





గురువారం, ఆగస్టు 13, 2026 | పేజీలు :6


## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో

# కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థుల హాజరు, తరగతి గదులు, వంటగది పరిశీలన
- మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశం
- పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన



**నాగర్ కర్నూల్ ఆగస్టు 12 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )**
విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, మౌలిక వసతులు, భోజన సదుపాయాలు, పాఠశాల పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ బిజినపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు చేరుకున్న కలెక్టర్ అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. పాఠశాలకు చేరుకున్న జిల్లా కలెక్టర్ తొలుత తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల విద్యాభ్యాసం, తరగతుల నిర్వహణ తీరును గమనించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతున్నారా..? ఉపాధ్యాయులు విధులకు సక్రమంగాహాజరవుతున్నారా..? అనే అంశాలను తెలుసుకునేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు.
పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారికి అనుకూలమైన విద్యా వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత పాఠశాల ప్రత్యేక అధికారిపై ఉందని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల

## సైబర్ మోసాలపై

# అప్రమత్తతే రక్షణ

" స్టే అలెర్ట్, స్టే అవేర్, స్టే సైబర్ సేఫ్" సందేశంతో పోలీసుల అవగాహన




### ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళికతో

# సిద్ధం కావాలి

కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలి: రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



**మహబూబ్‌నగర్, ఆగస్టు 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
ఖరీఫ్ సీజన్ 2026--27లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.
బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి జిల్లా స్థాయి

## నేర నియంత్రణకు

# సమర్థవంతమైన దర్యాప్తు

- పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
నేర నియంత్రణకు సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాద కేసులు, పెండింగ్, సైబర్ నేరాలు, ఎన్ డి పి ఎస్ యాక్ట్ కేసులు, సీసీ టి ఎన్ ఎస్ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, కోర్టు కేసుల పరిష్కారం, పెండింగ్ నాన్- బెయిలబుల్ వారెంట్ల అమలు తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.



# నేర నియంత్రణకు సమర్థవంతమైన దర్యాప్తు

ప్రతి కేసును క్షుణ్ణంగా దర్యాప్తు చేసి, నాణ్యమైన దర్యాప్తు ద్వారా నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత సమయంలో దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు:

రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ ప్రమాదాల నియంత్రణకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ప్రజలకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సైబర్ మోసాలపై ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎన్ డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ ఎన్ బి డబ్ల్యు ఎస్ ను త్వరితగతిన అమలు చేయాలని సూచించారు.
సీసీ టీ ఎన్ ఎస్ లో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఎస్పీ అధికారులకు సూచించారు.

సమావేశంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, డీఎస్పీ లు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, గిరికుమార్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్, రూరల్ సీఐ గాంధీనాయక్, భూత్పూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సీసీ ఎస్ ఇన్‌స్పెక్టర్లు నాగార్జున గౌడ్, రవిబాబు, ఐటీ సెల్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు రాఘవేందర్, రవి తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తతే రక్షణ

మహబూబ్‌నగర్, ఆగస్టు 12 ( సాక్ష్యం బ్యూరో ): సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ దరావత్ జానకి సూచనలతో మహబూబ్‌నగర్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

"సురక్షా కా తిరంగా -- " స్టే అలెర్ట్, స్టే అవేర్, స్టే సైబర్ సేఫ్" అనే సందేశంతో మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి డీఎస్పీ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఐటీ ఉద్యోగులు, వైద్యులు, మెడికల్ అసోసియేట్స్, చార్టర్డ్ అకౌంటెంట్లు, కో-ఆపరేటివ్ సంస్థల ఉద్యోగులు, వ్యాపారులు, వర్తకులు, పారిశ్రామిక రంగ ప్రతినిధులు, బ్యాంకు ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్, బ్యాంకు ఖాతా ఉండటంతో సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త మార్గాల్లో ప్రజలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సాధారణ నేరాలతో పోలిస్తే సైబర్ మోసాల ద్వారా భారీగా ఆర్థిక నష్టం జరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పెట్టుబడి మోసాలపై అప్రమత్తత అవసరం:

నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌లు, స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ యాప్‌లు, కొరియర్ ఫ్రాడ్‌లు, లోన్ యాప్‌లు, క్యూ ఆర్ కోడ్ మోసాలు, ఆన్‌లైన్ ఉద్యోగ మోసాలు, సోషల్ మీడియా మోసాలు, "డిజిటల్ అరెస్ట్" పేరుతో జరిగే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అధిక లాభాలు వస్తాయని చెప్పే వ్యక్తులు, సంస్థలు లేదా యాప్‌లను నమ్మి పెట్టుబడులు పెట్టవద్దని తెలిపారు. పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా, అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్ నిజమైనదేనా, సంబంధిత ఆర్థిక నియంత్రణ సంస్థల అనుమతులు ఉన్నాయా అనే విషయాలను పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని, లాటరీలు, గిఫ్ట్‌లు, క్యాష్‌బ్యాక్‌లు, కస్టమర్ కేర్ పేరుతో వచ్చే అనుమానాస్పద కాల్స్, సందేశాలు, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

"డిజిటల్ అరెస్ట్" పేరుతో మోసాలకు గురికావద్దు:

పోలీసులు, సీబీఐ, ఈడీ లేదా కోర్టు అధికారులమంటూ వీడియో కాల్స్ చేసి భయపెట్టి డబ్బులు వసూలు చేసే "డిజిటల్ అరెస్ట్" మోసాలను నమ్మవద్దని డీఎస్పీ స్పష్టం చేశారు. పోలీసులు ఎప్పుడూ వీడియో కాల్ ద్వారా ఎవరినీ అరెస్ట్ చేయరని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్, పాస్‌వర్డ్‌లు, ఏటీఎం వివరాలు వంటి వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని హెచ్చరించారు.

మోసానికి గురైతే వెంటనే 1930కు సమాచారం:

సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసి తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.
అనంతరం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన సైబర్ భద్రత అవగాహన వీడియోలను ప్రదర్శించారు. సైబర్ నేరాల తాజా విధానాలు, వాటి నుంచి రక్షణ పొందే మార్గాలపై పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమం ముగింపులో "సురక్షా కా తిరంగా" పోస్టర్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరి కుమార్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, వన్‌టౌన్ మహిళా ఎస్ఐ వసంత, సైబర్ క్రైమ్ ఎస్ఐ శ్రావణ్ కుమార్, ఐటీ సెల్ సిబ్బంది, కళాబృందం సభ్యులు, వివిధ వృత్తులు, వ్యాపార, పారిశ్రామిక రంగాలకు చెందిన ప్రతినిధులు, బ్యాంకు ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలి

ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గత మూడు సీజన్లలో వరి ధాన్యం కొనుగోళ్లకు నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన పురోగతిని సమీక్షించారు. ప్రస్తుత పంట సాగు పరిస్థితి, క్రాప్ బుకింగ్ వివరాలను పరిగణనలోకి తీసుకుని వ్యవసాయ శాఖ అంచనాల ఆధారంగా ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన దిగుబడికి అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.
కొనుగోలు కేంద్రాల నిర్వహణ, మిల్లింగ్ సామర్థ్యం, రవాణా, ఇతర మౌలిక సదుపాయాలపై సంబంధిత శాఖలు ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం కొలిచే పరికరాలు, టార్పాలిన్లు, ధాన్యం శుభ్రపరిచే పరికరాలు తదితర అవసరమైన సామగ్రిని తగినంతగా అందుబాటులో ఉంచాలని సూచించారు. అవసరమైన పరికరాలను సంబంధిత సంస్థల ద్వారా ముందుగానే సమకూర్చుకోవాలని తెలిపారు.
మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి :
మిల్లుల వారీగా ధాన్యం కేటాయింపు, మిల్లింగ్ సామర్థ్యం, గత సీజన్‌కు సంబంధించిన లక్ష్యాల పురోగతిపై కూడా అదనపు కలెక్టర్ సమీక్షించారు. మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి, ప్రభుత్వానికి అవసరమైన బియ్యం సరఫరా ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.
పీడీఎస్ బియ్యం సరఫరాపై సమీక్ష:
అనంతరం ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా మూడు నెలలకు అవసరమైన బియ్యం సరఫరా, పంపిణీపై జిల్లా పౌర సరఫరాల అధికారి, సంబంధిత సిబ్బందితో అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని చౌకధర దుకాణాలకు అవసరమైన బియ్యం సరఫరాలో ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధించినట్లు అధికారులు వివరించారు. మిగిలిన బియ్యం నిల్వలను కూడా త్వరితగతిన చౌకధర దుకాణాలకు తరలించి పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. చౌకధర దుకాణాల వద్ద బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు లేదా ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి కృష్ణ, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ రవి నాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు, పౌర సరఫరాల డీటీలు తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

హాజరు విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పర్యవేక్షణకొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం కలెక్టర్ పాఠశాలలోని వంటగదిని, అక్కడి పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు భోజనం తయారు చేసే ప్రదేశంలో పరిశుభ్రత, ఆహార పదార్థాల నిర్వహణ, వంటగది పరిసరాల పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహారం తయారీ విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ భోజనం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మెనూలో పేర్కొన్న ఆహార పదార్థాలను సక్రమంగా అందించడంతో పాటు, నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని ఆదేశించారు.విద్యార్థులకు అందించే భోజనం నాణ్యమైనదిగా, పౌష్టిక విలువలతో కూడినదిగా ఉండేలా సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు.పాఠశాల ఆవరణ, వంటగది, పరిసర ప్రాంతాలను..ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు ఎక్కువ సమయం గడిపే పాఠశాల ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని, వంటగది పరిసరాల్లో అపరిశుభ్రతకు తావులేకుండా చూడాలని అధికారులకు సూచించారు. .కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినులకు ప్రభుత్వం కల్పిస్తున్న విద్య, వసతి, భోజన తదితర సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న అంశంపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల అవసరాలను తెలుసుకుని, సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ వెంట బిజినపల్లి తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో కథలయ్య, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# వడ్డేపల్లి మున్సిపల్ కమిషనర్‌ను వెంటనే బదిలీ చేయాలి

## 9వ వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి సూరి డిమాండ్



**వడ్డేపల్లి ఆగస్టు 12(ప్రజా జ్యోతి):**
వడ్డేపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్న మున్సిపల్ కమిషనర్‌ను వెంటనే బదిలీ చేయాలని 9వ వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి సూరి డిమాండ్ చేశారు.బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కౌన్సిల్ తీర్మానం చేసి నాలుగు నెలలు గడిచినా కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పట్టణంలోని పలు వీధుల్లో వీధిలైట్లు లేక ప్రజలు చీకట్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఈ సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినప్పుడు'ఏఈ లేరు,ఎస్టిమేషన్ కావాలి'అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని విమర్శించారు.అదేవిధంగా మ్యుటేషన్ పనుల కోసం వచ్చే ప్రజలను డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.'నేనింతే.. ఎవరికైనా చెప్పుకోండి' అంటూ ధిక్కార ధోరణితో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడు నెలలు గడుస్తున్నా ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదని,వార్డుల్లో కనీస సౌకర్యాలు సైతం లేవని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలను పట్టించుకోని ఇలాంటి కమిషనర్ వడ్డేపల్లి మున్సిపాలిటీకి అవసరం లేదని సూరి అన్నారు.జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే వెంటనే స్పందించి కమిషనర్‌ను బదిలీ చేసి, ప్రజా సమస్యలపై స్పందించే అధికారిని నియమించాలని కోరారు.ఈ సమావేశంలో బొంబాయి రాముడు, సుదర్శన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలి

## మండల ప్రత్యేక అధికారి జగ్గ నాయక్
## పెన్షన్లు,రేషన్ కార్డులపై అధికారుల సమీక్ష



**మల్దకల్,ఆగస్టు 12(ప్రజా జ్యోతి)**
:జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి జగ్గ నాయక్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కొత్త పెన్షన్లు,రేషన్ కార్డుల మంజూరు,పాఠశాల విద్యార్థుల దుస్తులు, సెన్సెస్,ఎస్ఐఆర్,ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) పనులతో పాటు వివిధ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్షించారు.ఈ సందర్భంగా జగ్గ నాయక్ మాట్లాడుతూ,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా అధికారులు,పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి,వ్యవసాయ అధికారి కే.రాజశేఖర్,ఎంపీఓ జాకీర్,ఎమ్మార్వో రూప్సీ రాణి,ఏఈ (ఆర్‌డబ్ల్యూఎస్) పరమేష్,ఏపీఎం బిస్మం నాయుడు,ఏపీవో సుజాత,పంచాయతీ కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ప్రత్యేక పూజలు

## 9 వేల మంది భక్తుల దర్శనం
## -ఘనంగా అభిషేకం,అష్టోత్తర పూజలు



ధరూర్,ఆగస్టు 12(ప్రజా జ్యోతి ప్రతినిధి):జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల గ్రామంలో 18వ శతాబ్దానికి చెందిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం ఆషాఢ అమావాస్య,భీమాన అమావాస్య,అతి అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు,అభిషేకాలు,అష్టోత్తర పూజలు వైభవంగా నిర్వహించారు. కర్ణాటక,ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 9 వేల మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు మాట్లాడుతూ,ఉడిపి పాలిమర్ మఠం పీఠాధిపతులు స్వామివారికి ప్రత్యేక సంస్థాన పూజలు నిర్వహించినట్లు తెలిపారు.భక్తులు కొబ్బరికాయలు,ఆకులు,నిమ్మకాయలు, గుమ్మడికాయలు,పుష్ప తోరణాలు,పుష్పమాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.కర్ణాటకలోని రాయచూరు తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు పాదయాత్రగా ఆలయానికి చేరుకుని భజనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ఆవరణలో పవమాన హోమాలు,నవగ్రహ హోమాలు,గోమాత పూజలు నిర్వహించారు.ఉడిపి పాలిమర్ పీఠాధిపతులు శ్రీ 1008 విద్యాతీర్థ శ్రీపాదుల వారు రామాయణ ప్రవచనం నిర్వహించారు.శ్రీరాముని కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ



ఐక్యతతో మెలగాలని,ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.భక్తుల సౌకర్యార్థం గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ ఏ. శ్రీధర్,ఆర్టీసీ కంట్రోలర్ విజయభాస్కర్,భీంపురం సర్పంచ్ రఘు విజ్ఞప్తి మేరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదంతో పాటు తేనీరు,కాఫీ,అల్పాహారం అందించారు.అమావాస్య సందర్భంగా వందలాది మంది భక్తులు ఆలయ ప్రాంగణంలోనే బస చేశారు.గురువారం నుంచి శ్రావణమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తుల కోరిక మేరకు ఆలయంలో ప్రత్యేక పూజలు,దీపారాధనలు,హోమాలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు తెలిపారు.ఆలయానికి వచ్చిన వాహనాలకు వేదమూర్తులైన బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేలాది మంది భక్తుల రాకతో ఆలయ పరిసరాలు జాతరను తలపిస్తూ సందడిగా మారాయి.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆద్య వామనాచారి,ఆద్య కిష్టాచారి,ఆద్య మధ్వాచారి,ట్రస్ట్ చైర్మన్ గిరిరావు, కార్యనిర్వహణాధికారి రాజేశ్వర శర్మ,ఆలయ సిబ్బంది భాస్కర్,రాజ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జమిస్తాపూర్‌లో రీసర్వే పనుల పరిశీలన



**మహబూబ్‌నగర్, ఆగస్టు 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
మహబూబ్‌నగర్ రూరల్ మండలం జమిస్తాపూర్ గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే పనులను రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ బుధవారం పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న రీసర్వే ప్రక్రియ, ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. క్యాడాస్ట్రల్ పరిధిలో లేని గ్రామాల్లో చేపడుతున్న రీసర్వే పనులను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని ఆమె అధికారులను ఆదేశించారు. రీసర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, భూ రికార్డుల నవీకరణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ పరిశీలనలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్, మహబూబ్‌నగర్ రూరల్ మండల తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# డాక్టర్ ప్రియాంక కుటుంబానికి అండగా ఉంటాం:ఎమ్మెల్యే విజయుడు



**ఐజ ఆగస్టు 12(ప్రజా జ్యోతి):**
ఏక్లాస్‌పురం గ్రామానికి చెందిన డాక్టర్ ప్రియాంక కుటుంబాన్ని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు బుధవారం పరామర్శించారు.ప్రియాంక చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి,కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ సందర్భంగా ప్రియాంక మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని,వారికి శిక్ష పడేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు.ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వాల నుంచి రూ.2 కోట్ల ఆర్థిక సాయం అందించాలని,కుటుంబంలో ఒకరికి తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం మాజీ మంత్రి,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కేటీఆర్‌తో ఫోన్‌లో ప్రియాంక కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే మాట్లాడించారు.ఈ సందర్భంగా కేటీఆర్ కుటుంబ సభ్యులను పరామర్శించి,బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.

# చలో హైదరాబాద్.. విజయవంతం చేయాలి

**చిన్నంబావి,ఆగస్టు 12 (ప్రజా జ్యోతి)**
23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం చిన్నంబావి మండల వనరుల కేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీడీఓ సుర్ర ఆదర్శ్ గౌడ్, ఎంఈఓ పి.ఆర్. రాజేందర్‌రావు చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. వనపర్తి జిల్లా తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మద్దిలేటి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐక్యంగా పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చి 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



# మెడికల్ విద్యార్థిని ప్రియాంక మృతిపై విద్యార్థి సంఘాల కొవ్వొత్తుల ర్యాలీ

## – ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: పోలే నరేందర్

**మహబూబ్‌నగర్ ఆగస్టు 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
పాలమూరు విశ్వవిద్యాలయంలో మెడికల్ విద్యార్థిని ప్రియాంక మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పాలమూరు యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ చైర్మన్, తెలంగాణ స్టూడెంట్ రెవల్యూషన్ జేఏసీ వ్యవస్థాపకులు పోలే నరేందర్ ప్రభుత్వాన్ని కోరారు.ప్రియాంక మృతికి నిరసనగా పాలమూరు విశ్వవిద్యాలయంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలే నరేందర్ మాట్లాడుతూ ఘటనకు కారణమైన వ్యక్తులను గుర్తించి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రియాంక కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, కుటుంబానికి రూ.3 కోట్ల ఎక్స్‌గ్రేషియా అందించాలని, ఆమె తల్లిదండ్రుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.



బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.అదేవిధంగా విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని, డ్రంక్ అండ్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీయూ జేఏసీ కన్వీనర్ సాయి స్వేరో, పాలమూరు యూనివర్సిటీ అధ్యక్షులు పవన్ కుమార్, ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు సుధాకర్, ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు ఉదయ్, బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రాజు, దళిత సంఘం రాష్ట్ర నాయకులు అక్షయ్, గిరిజన సంఘం నాయకులు వినయ్, బీఎస్ఎఫ్ నాయకులు, బీసీ సంఘం అధ్యక్షులు తాయప్ప, టీఆర్ఎస్వీ అధ్యక్షులు భరత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను బానిసలుగా మారుస్తున్న మోదీ ప్రభుత్వం

## – సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్

**చిన్నంబావి, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి)**
కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య ప్రచార యాత్ర బుధవారం చిన్నంబావి మండల కేంద్రానికి చేరుకుంది. వీపనగండ్ల మండలంలోని కొర్లకుంట, బొల్లారం, తూముకుంట, సంగినేనిపల్లి, సంపత్‌రావుపల్లి గ్రామాల మీదుగా యాత్ర కొనసాగింది.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పల్లెపల్లెకు వెళ్లి ప్రజలను చైతన్యవంతం చేయడమే యాత్ర ప్రధాన లక్ష్యమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్రం విఫలమైందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వ విధానాలు దేశాన్ని తిరోగమన దిశలోకి నెడుతున్నాయని విమర్శించిన రమేష్.. “మాటలు కోటలు దాటుతున్నా.. చేతలు మాత్రం గడప దాటడం లేదు” అన్న రీతిలో పాలన సాగుతోందన్నారు. ధరలు తగ్గిస్తామని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు.విద్యార్థులు, యువత, మహిళలు, కార్మికులు, రైతులకు నష్టం కలిగించే విధానాలను ప్రజలకు వివరిస్తూ చైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో సామాన్య ప్రజలు, కార్మికులు, రైతులపై ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. పేపర్ లీకేజీలతో విద్యార్థుల







భవిష్యత్తు దెబ్బతింటోందని అన్నారు. కుల, మతాల మధ్య విభేదాలు సృష్టించే విధానాలను విడనాడాలని కోరారు.లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి, విద్యుత్ రంగ ప్రైవేటీకరణను నిలిపివేయాలి, పాత ఉపాధిహామీ చట్టాన్ని కొనసాగించాలి, ఎనిమిది గంటల పనిదినాన్ని పకడ్బందీగా అమలు చేయాలి అని డిమాండ్ చేశారు. కార్మికులు, రైతుల హక్కులను కాపాడేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు వంక గోపాల్, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కురుమయ్య, సీపీఐ వీపనగండ్ల మండల కార్యదర్శి కే. శ్రీరామ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, శివకుమార్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణవేణి, సీపీఐ పాన్గల్ మండల మాజీ కార్యదర్శి కురుమయ్య, కార్మిక భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

# ధ్యానంతో విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం

**చిన్నంబావి, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి)**
విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ధ్యానం ఎంతో దోహదపడుతుందని పిరమిడ్ ధ్యాన మాస్టర్లు పేర్కొన్నారు. చిన్నంబావి మండలంలోని పెద్దమారూర్ గ్రామంలో పీఎస్ పెద్దమారూర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయురాళ్లు అలివేల, రమణమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ధ్యానం ప్రాధాన్యతను వివరించారు.
‘ధ్యానం అంటే శ్వాసపై ధ్యాస’ అని పేర్కొంటూ.. ప్రతిరోజూ ధ్యానం చేయడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరగడంతో పాటు పరీక్షల భయం తగ్గుతుందని తెలిపారు. ఆత్మన్యూనత భావాలు, అలజడి, విసుగు వంటి వాటిని అధిగమించేందుకు ధ్యానం ఉపయోగపడుతుందని చెప్పారు. నిద్రలేమి సమస్య నుంచి కూడా బయటపడేందుకు ధ్యానం దోహదపడుతుందని వివరించారు.పాఠశాలల్లో ప్రార్థన సమయంలో ప్రతిరోజూ 5 నుంచి 10 నిమిషాలపాటు ధ్యానం చేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. వయసుకు అనుగుణంగా ప్రతిరోజూ క్రమం తప్పకుండా ధ్యానం చేయడం అలవాటుగా మార్చుకోవాలని కోరారు. ముగి జ్ఞానేశ్వరి, లక్ష్మీకళాశెట్టి, అశోక్‌రెడ్డి, టి.బాలస్వామి, పి.ఉత్తరయ్య, నంది శేఖర్‌రెడ్డి, జయమ్మ తదితర పిరమిడ్ మాస్టర్లు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఆరోగ్యకరమైన జీవన విధానంతో పాటు ధ్యానాన్ని అలవాటుగా చేసుకోవాలని సూచించారు. కొప్పునూరులోని ‘అమ్మా--నాన్న పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని’ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నంది శేఖర్‌రెడ్డి, జయమ్మ కోరారు. పిరమిడ్‌లో ధ్యానం చేయడం వల్ల అదనపు శక్తిని పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



# సర్పంచులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

## ఇటిక్యాల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ప్రభాకర్ రెడ్డి ఏకగ్రీవం



**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి),ఆగస్టు 12:**
జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా మునగాల గ్రామ సర్పంచ్ కొప్పుల ప్రభాకర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అలంపూర్ మాజీ ఎమ్మెల్యే,ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రుక్మానంద రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డిని సంపత్ కుమార్ శాలువాతో సత్కరించి అభినందించారు.అనంతరం సంపత్ కుమార్ మాట్లాడుతూ,సర్పంచులందరూ సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి,సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేయాలని సూచించారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ముందుండాలని అన్నారు.తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సర్పంచులందరికీ ప్రభాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.సర్పంచుల సమస్యల పరిష్కారానికి,గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి ఆటో నడిపిన వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష

## – డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుల కఠిన చర్యలు



**మహబూబ్‌నగర్, ఆగస్టు 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తమతో పాటు ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగించే వారిపై మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఎనిమిది మందిని గుర్తించారు. వారిని బుధవారం సెకండ్ క్లాస్ కోర్టు గౌరవ న్యాయమూర్తి ఆర్. శశిధర్ ఎదుట హాజరుపరిచారు.వారిలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడిపిన ఏడుగురికి న్యాయస్థానం ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున జరిమానా విధించింది. అదే సమయంలో మద్యం సేవించి ఆటో నడిపిన పూజారి రమేష్, ఆటో డ్రైవర్, పూజారి తండా, హన్వాడ మండలం వ్యక్తికి న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్ష విధించింది.

**మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే ప్రాణాలకు ప్రమాదం:**
మద్యం సేవించి వాహనం నడపడం చట్టవిరుద్ధమే కాకుండా వాహనంపై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలకు దారితీసే ప్రమాదం ఉందని పోలీసులు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కారణంగా వాహనం నడిపే వ్యక్తితో పాటు రోడ్డుపై ప్రయాణించే అమాయకుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ఇకపై కూడా నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. “మద్యం సేవించి వాహనం నడపవద్దు.. మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడండి” అని జిల్లా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# చిన్న గాటుతో పెద్ద వైద్యం..

## -ఇంటర్వెన్షనల్ రేడియాలజీతో ఎన్నో వ్యాధులకు చికిత్స..
## -అనేక వ్యాధులకు మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్స అందిస్తున్న ఇంటర్వెన్షనల్ రేడియాలజీ
## - సరైన సమయంలో సరైన చికిత్స పొందేందుకు ప్రజల్లో అవగాహన అవసరం : డా. సంకేత్ కులకర్ణి




**మహబూబ్‌నగర్, ఆగస్టు 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
ఆధునిక వైద్య సాంకేతికత అభివృద్ధితో గతంలో పెద్ద శస్త్రచికిత్స అవసరమైన అనేక వ్యాధులకు ప్రస్తుతం తక్కువ కోతతో మినిమల్లీ ఇన్వేసివ్ విధానాల్లో చికిత్స అందించే అవకాశాలు ఉన్నాయని యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డా. సంకేత్ కులకర్ణి తెలిపారు. మహబూబ్‌నగర్‌లో యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్వెన్షనల్ రేడియాలజీ ( ఐ. ఆర్)ఆధునిక వైద్యంలోని ప్రత్యేక విభాగమని, అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, యాంజియోగ్రఫీ వంటి ఇమేజింగ్ పద్ధతుల సహాయంతో చిన్న సూది గాటు లేదా సన్నని కాథెటర్ ద్వారా అనేక వ్యాధులను నిర్ధారించి చికిత్స చేయవచ్చని వివరించారు.
కాలేయ కణితులు, అంతర్గత రక్తస్రావం, రక్తనాళాల్లో అడ్డంకులు, పెరిఫెరల్ వాస్క్యులర్ వ్యాధులు, వెరికోస్ వెయిన్స్, గర్భాశయ ఫైబ్రాయిడ్లు, అబ్సెస్‌లు, పిత్తనాళాల వ్యాధులు, కిడ్నీతో పాటు ఇతర కణితులు, వివిధ రక్తనాళాల వ్యాధులకు ఇంటర్వెన్షనల్ రేడియాలజీ ద్వారా చికిత్స చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.
సరైన రోగులను ఎంపిక చేసిన సందర్భాల్లో మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్స వల్ల చిన్న గాటు, తక్కువ నొప్పి, ఆసుపత్రిలో తక్కువ రోజులు ఉండాల్సి రావడం, త్వరగా కోలుకునే అవకాశం వంటి ప్రయోజనాలు ఉండవచ్చని చెప్పారు. అయితే ప్రతి రోగికి ఒకే చికిత్స సరిపోదని, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి మందులు, ఇంటర్వెన్షనల్ చికిత్స, శస్త్రచికిత్స లేదా వీటి కలయికలో సరైన విధానాన్ని వైద్యులు నిర్ణయిస్తారని స్పష్టం చేశారు.
స్ట్రోక్‌లో ప్రతి నిమిషం కీలకం:
స్ట్రోక్ విషయంలో ప్రజల్లో అవగాహన మరింత పెరగాల్సిన అవసరం ఉందని డా. సంకేత్ తెలిపారు. ముఖం, చేయి లేదా కాలు అకస్మాత్తుగా బలహీనపడటం లేదా మొద్దుబారడం, మాట తడబడటం, మాట్లాడలేకపోవడం, నడకలో తడబడటం, సమతుల్యత కోల్పోవడం, అకస్మాత్తుగా చూపు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు.
మెదడులోని ప్రధాన రక్తనాళంలో రక్తం గడ్డకట్టిన కొంతమంది ఎంపిక చేసిన రోగుల్లో మెకానికల్ థ్రాంబెక్టమీ ద్వారా రక్తం గడ్డను తొలగించి మెదడుకు రక్తప్రసరణను పునరుద్ధరించే అవకాశం ఉంటుందని తెలిపారు. అందువల్ల వీలైనంత త్వరగా సరైన స్ట్రోక్ చికిత్స అందించే ఆసుపత్రికి చేరుకోవడం అత్యంత ముఖ్యమని చెప్పారు. తీవ్రమైన అంతర్గత రక్తస్రావాన్ని నియంత్రించడంలో కూడా ఇంటర్వెన్షనల్ రేడియాలజీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఎంబోలైజేషన్ విధానంలో కాథెటర్ ద్వారా రక్తస్రావం అవుతున్న రక్తనాళాన్ని గుర్తించి నియంత్రించే అవకాశం ఉంటుందని, సరైన రోగుల్లో పెద్ద శస్త్రచికిత్స అవసరాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని వివరించారు.

రోగికి సరైన చికిత్సే లక్ష్యం:

ప్రజల్లో ఇంటర్వెన్షనల్ రేడియాలజీపై అవగాహన పెరగడం ద్వారా సరైన రోగులకు సరైన సమయంలో తగిన చికిత్స అందించే అవకాశం పెరుగుతుందని డా. సంకేత్ అన్నారు.
“అనేక వ్యాధులకు పెద్ద శస్త్రచికిత్సతో పాటు మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్సా విధానాలు కూడా అందుబాటులో ఉన్నాయని ప్రజలు తెలుసుకోవాలి. తమ వ్యాధికి ఇలాంటి చికిత్స సరిపోతుందా అనే విషయాన్ని ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్‌ను సంప్రదించి తెలుసుకోవచ్చు” అని తెలిపారు.
“శస్త్రచికిత్సను భర్తీ చేయడం మా ఉద్దేశం కాదు. ప్రతి రోగికి, వారి పరిస్థితికి సరిపోయే అత్యుత్తమ చికిత్సా విధానం అందుబాటులో ఉండేలా చూడటమే లక్ష్యం” అని డా. సంకేత్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల్లో ఆధునిక, మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్సా విధానాలపై అవగాహన కల్పించడంలో మీడియా చేస్తున్న కృషిని అభినందించారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన ఈ మీడియా సమావేశంలో యశోద హాస్పిటల్స్ మేనేజర్ బి. సుదర్శన్ రెడ్డి, రోహిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం

## -సర్కారీ బడులను కాపాడుకోవాలి:
## -టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్



**గండీడ్, ప్రజాజ్యోతి:**
మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల టీఎస్‌యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణపై నాయకులు చర్చించారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కే. రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని అన్నారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీ, సీపీఎస్ పెన్షన్ సమస్య, హెల్త్ కార్డులు, ఉపాధ్యాయుల బకాయిలు, పెన్షనర్ల బకాయిలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ విద్యారంగం తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా అనేక సమస్యలను ఎదుర్కొంటోందని తెలిపారు. ఉపాధ్యాయుల కొరత, పర్యవేక్షణ లోపం, మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయులపై బోధనేతర పనుల ఒత్తిడి వంటి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయితేనే పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. సర్కారీ బడులు మూతపడితే వాటిపై ఆధారపడే విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని, అందువల్ల ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఉపాధ్యాయులు ఐక్యంగా ఉండి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు కే. రవికుమార్, మహమ్మదాబాద్ మండల అధ్యక్షులు శేగ్గారి వెంకటయ్య, గండీడ్ మండల అధ్యక్షులు గంట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, ఉపాధ్యక్షులు గోవింద్ పాల్గొన్నారు.

# ఆపదలో అండగా.. రూ.2 లక్షల ఎల్‌ఓసీ

వనపర్తి, ఆగస్టు 12 (ప్రజాజ్యోతి): గుండె సంబంధిత అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కుమ్మరి గుణగంటి స్వామి తండ్రి పెంటయ్య వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం నుంచి రూ.2 లక్షల ఎల్‌ఓసీని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మంజూరు చేయించారు. పెంటయ్య చికిత్స పొందుతున్న విషయాన్ని కౌన్సిలర్ బొడ్డుపల్లి పరశురాం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ప్రభుత్వ పరంగా ఎల్‌ఓసీ మంజూరుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నిమ్స్ ఆసుపత్రిని సందర్శించిన కౌన్సిలర్ బొడ్డుపల్లి పరశురాం, బొడ్డుపల్లి రవి, గుణగంటి లక్ష్మీనారాయణ, గుణగంటి లోకేష్, నాగపూర్ అంజి తదితరులు పెంటయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా వైద్య సహాయం అందించేందుకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని వారు తెలిపారు.



# శ్రీ స్వయంభూ తిమ్మప్ప స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు



**మల్దకల్ ఆగస్టు 12(ప్రజా జ్యోతి):**
జోగులాంబ గద్వాల జిల్లా ప్రసిద్ధ ఆదిశిలా క్షేత్రమైన మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం,ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. దేవాలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణమాన్య పట్వారి ప్రహ్లాదరావు,ఈఓ సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది సేవలు అందించారు. ఈ సందర్భంగా కాకతీయ టెక్నో స్కూల్,శివ శివాని స్కూల్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సప్త భజనలో ఐదో రోజు సందర్భంగా పలు గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు హరినామ సంకీర్తనలు ఆలపించారు. భక్తుల భజనలతో ఆలయ ప్రాంగణం భక్తి సంద్రంగా మారింది.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎర్ర సత్యం

## : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



**మహబూబ్‌నగర్ ఆగస్టు 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
మాజీ శాసనసభ్యులు, ప్రజా నాయకుడు ఎర్ర సత్యం వర్ధంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఎర్ర సత్యం బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని, బీసీ కులాల ముద్దుబిడ్డగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. బలహీన వర్గాల హక్కులు, సంక్షేమం కోసం ఆయన నిరంతరం శ్రమించారని గుర్తుచేశారు. సామాన్య ప్రజల అభ్యున్నతి కోసం ఎర్ర సత్యం చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఆయన చూపిన మార్గంలో నడవడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు ఎర్ర శేఖర్, గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్ తదితరులు పాల్గొని ఎర్ర సత్యానికి నివాళులర్పించారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

గండీడ్, ప్రజాజ్యోతి: గండీడ్ మండలం జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుందేటి మంజుల కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంజుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మంజుల అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.8 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. మంజుల మృతి పట్ల నాయకులు సంతాపం వ్యక్తం చేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోస్గి మొగులయ్య, కోస్గి వెంకటేష్, కోస్గి శ్రీనివాసులు, సంటెం శేఖర్, తిరుపతి రెడ్డి, హనుమంతు, జక్లపల్లి శ్రీను, ఆంజనేయులు, కేశవులు, రామకృష్ణ, బాలు తదితరులు పాల్గొన్నారు.



# ట్రాక్టర్లతో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

### జాతీయ జెండాలతో మార్మోగిన గండీడ్..

### దేశభక్తిని చాటుకున్న బీజేపీ శ్రేణులు

గండీడ్, ప్రజాజ్యోతి: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం గండీడ్ మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు యు. రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై భారీ ట్రాక్టర్ల ర్యాలీని జాతీయ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని అన్నారు. జాతీయ జెండా మన స్వాతంత్ర్యానికి, దేశ సమైక్యతకు, సార్వభౌమత్వానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను గౌరవిస్తూ దేశభక్తి భావాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. దేశం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అన్నారు. యువత దేశ చరిత్రను తెలుసుకొని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్ మాట్లాడుతూ జాతీయ జెండా ప్రతి భారతీయుడి గుండెల్లో గర్వాన్ని నింపే ప్రతీక అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకుంటూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. దేశభక్తి అనేది కేవలం పండుగ రోజుల్లో మాత్రమే కాకుండా



దేశం పట్ల బాధ్యతగా ప్రతి రోజూ ఆచరణలో చూపించాలని అన్నారు. ర్యాలీలో భారీ సంఖ్యలో ట్రాక్టర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, ప్రజలు చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకొని ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో గండీడ్ పరిసరాలు మార్మోగాయి. ట్రాక్టర్లపై రెపరెపలాడిన త్రివర్ణ పతాకాలు ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ప్రహ్లాదరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్, రాష్ట్ర నాయకులు వెన్న ఈశ్వరప్ప, ఏ.వి. రాములు, గిరమోని శ్రీనివాసులు, మారుతి కిరణ్, మండల బీజేపీ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, హర్ ఘర్ తిరంగా ర్యాలీ కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నం.

**విపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**

దేశంలో బిజెపి నరేంద్ర మోడీ పాలనను ప్రజలు తరిమికొట్టే సమయం ఆసన్నమైందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరామ్, సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, సిపిఐ అనుబంధ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి వంకా గోపాల్ అన్నారు. వీపనగండ్ల మండలం లో ప్రజా చైతన్య పాదయాత్ర ఒ ప్రచార యాత్ర ను ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు, కేతేపల్లి ఉపసర్పంచ్ కృష్ణవేణి కొర్లకుంటలో జెండా ఊపి ప్రారంభించారు. బొల్లారం, తూముకుంట,సంగినేనిపల్లి, సంపత్ రావు పల్లి, పెంట్లవెల్లి మండలం సింగోరం, గోపులాపురం, జటప్రోలు మీదుగా వీపనగండ్ల మండల కేంద్రానికి చేరుకుంది. వీపనగండ్ల తో పాటుపలుచోట్ల మాట్లాడుతూ హిందుత్వ, రామ మందిరం పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని యువతను, స్విస్ బ్యాంకు నల్లధనం తెచ్చి ప్రతి రైతు అకౌంట్లో రూ. 15 లక్షలు వేస్తామని, వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని, యువతకు ఉపాధి కల్పిస్తామని ఎన్నో హామీలు ఇచ్చి ఏ ఒక్కటి నెరవేర్చలేదు అన్నారు. 12 ఏళ్లుగా నరేంద్ర మోడీ చేస్తున్న మోసాన్ని, బూటక ప్రచారాన్ని ప్రజలు గ్రహించారన్నారు. నీట్ పేపర్ వన్ లీకేజీ పై సిజెపి ఉద్యమంలో యువతలో గూడు కట్టుకున్న ఆగ్రహం కట్టలు తెంచుకుందని, ఆ దిబ్బకు విద్యామంత్రి నరేంద్ర మోడీని రాజీనామా చేయించక తప్పలేదు అన్నారు. దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పటానికి ఈ ఒక్క సంఘటన చాలు అన్నారు. డి ఏ పి యూరియా తదితర రసాయనిక ఎరువుల ధరలను పెంచిన మోది రైతుల పంటకు గిట్టుబాటు ధరను ఇవ్వటం లేదన్నారు. దేశంలోని పేదలు రైతులు కార్మికులను నరేంద్ర మోడీ శత్రువులుగా, ఆదాని అంబానీ సంపన్న కుటుంబాలను మిత్రులుగా భావిస్తున్నారన్నారు. వారికి లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వటం లేదన్నారు. కేంద్ర వైఫల్యాలను ఎండగట్టేందుకు సిపిఐ జాతీయ కమిటీ ఆగస్టు 6 నుంచి 14




వరకు దేశంలో గ్రామ గ్రామాన ప్రజా చైతన్య యాత్రలను నిర్వహించాలని తలపెట్టిందని అందులో భాగంగానే వీపనగండ్ల మండలంలో యాత్ర సాగిందన్నారు. అధిక ధరలను అరికట్టటం, ప్రతి యువకునికి ఉద్యోగం, పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వటం, 33% మహిళా రిజర్వేషన్ అమలు చేయటం, బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు, దళితులు ఆదివాసులపై దాడులు ఆపటం, లేబర్ కోడులను రద్దు చేయడం ప్రధాన డిమాండ్ అని కేంద్రం వాటిని నెరవేర్చాలన్నారు. గ్రామ గ్రామాన ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి వంక గోపాల్ ఆధ్వర్యంలో కళాకారులు కృష్ణవేణి, జయమ్మ, శిరీష, రమేష్ తదితరులు పాడిన విప్లవ గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, వంక గోపాల్, ఎం కురుమయ్య ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు  జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, ఉపాధ్యక్షురాలు జయమ్మ, వనపర్తి పట్టణ కన్వీనర్ శిరీష, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కురుమన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, బొల్లారం సిపిఐ కార్యదర్శి చల్మారెడ్డి ఎండి ముస్తఫా  సుబ్బయ్య.తదితరులు పాల్గొన్నారు.

## చౌడేశ్వరి దేవి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి, ఆగస్టు 12 (ప్రజాజ్యోతి):**

శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి సందర్భంగా బుధవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు నిర్వాహకులు, భక్తులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వనపర్తి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ప్రశాంతంగా జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబంపై అమ్మవారి దీవెనలు ఉండాలని, ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, కాంగ్రెస్ నాయకులు బి.కృష్ణ, బ్రహ్మంచారి, చీర్ల సత్యం సాగర్, చుక్కరాజు, నందిమల్ల చంద్రమౌళి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ ఆసుపత్రుల్లో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీలు



**మహబూబ్‌నగర్, ఆగస్టు 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, నిబంధనల అమలు తీరును పరిశీలించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సాన్వి, అభయప్రద, మారుతి, వెన్నెల, ఆరోగ్య తదితర ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసి రికార్డులు, వైద్య సేవల నిర్వహణ, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులు వివిధ వైద్య సేవలకు వసూలు చేసే చార్జీల వివరాలను తప్పనిసరిగా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది వివరాల్లో మార్పులు చోటుచేసుకున్నప్పుడు సంబంధిత సమాచారాన్ని కార్యాలయంలో తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన ఒప్పంద పత్రాలు, పొల్యూషన్ కంట్రోల్ సర్టిఫికెట్లు, ఫైర్ సేఫ్టీ ఆడిట్ నివేదికలు వంటి అవసరమైన పత్రాలను కొన్ని ఆసుపత్రులు సమర్పించాల్సి ఉందని తెలిపారు. ఆయా పత్రాలను నిర్దేశిత గడువులో సమర్పించాలని, లేకపోతే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనల ప్రకారం జిల్లా కలెక్టర్ అనుమతితో తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రజలకు పారదర్శకమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డా. శ్రీనివాసులు సూచించారు. ఈ తనిఖీల్లో ప్రోగ్రాం అధికారి డా. రాజు, డా. పులి విద్య, హెల్త్ ఎడ్యుకేటర్ హన్మంతు, సుభాష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు

## త్రివర్ణ పతాకాలతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

గండీడ్ మండలంలో ఘనంగా నిర్వహణ.. 80 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ



గండీడ్, ప్రజాజ్యోతి: దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గండీడ్ మండలంలో బుధవారం జాతీయ జెండా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు కె. విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వెన్నచెడ్ గ్రామం నుంచి ప్రారంభమైన ర్యాలీ గండీడ్, పగిడాల్, సల్కాపేట తదితర గ్రామాల మీదుగా సాగింది. సుమారు 80 ట్రాక్టర్లతో త్రివర్ణ పతాకాలను ఎగురవేస్తూ నిర్వహించిన ఈ భారీ ర్యాలీ ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం సల్కాపేటలో భోజన కార్యక్రమంతో ర్యాలీ ముగిసింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశం పట్ల నిజమైన విశ్వాసం, దేశభక్తి కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.  బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, సంక్షేమం, భద్రత రంగాల్లో ముందుకు సాగుతోందని అన్నారు. దేశ ప్రయోజనాలే ప్రధానంగా భావించి ప్రతి ఒక్కరూ జాతీయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ బీజేపీకి మత విద్వేషాలను రెచ్చగొట్టే ఉద్దేశం లేదని, దేశం, ప్రజల సంక్షేమమే పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. దేశం కోసం సైనికులు చేస్తున్న త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని, స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో దేశ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు కె. విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గండీడ్ మండలంలోని ప్రతి గ్రామంలో దేశభక్తి భావనను మరింత బలోపేతం చేయడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఉద్దేశమని అన్నారు. జాతీయ జెండా గౌరవాన్ని కాపాడుతూ దేశ ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు, యువకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. త్రివర్ణ పతాకాలతో అలంకరించిన ట్రాక్టర్లతో నిర్వహించిన ర్యాలీ దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా సాగింది.